క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూలవిరాట్

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని, 108 సాలాగ్రామ శివలింగాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

గడ్డివామి దగ్ధం

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో ఆదివారం గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు ఓబిలేసు పశువుల మేత కోసం ఇంటి వద్ద రెండున్నర ట్రాక్టర్ల వరి గడ్డి వాము వేసుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి వామికి నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి, మొత్తం కాలిపోయింది. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేశారు.

17 వరకూ ఒంటిపూట బడులు



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

యల్లనూరు: జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేయాలని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఎమ్మార్సీలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 38 ప్రభుత్వ పాఠశాలల్లో 2,871 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. ఎండలు అధికంగా ఉండడంతో ఈనెల 17వ తేదీ వరకు ఒంటిపూట బడులు ఉంటాయన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి: మండల కేంద్రంలో కొంతకాలంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం దాడి చేసినట్లు సీఐ శంకర్ రెడ్డి తెలిపారు. 9 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.20,600 నగదు, 8 సెల్‌ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. 9 మందిపై కేసు నమోదు చేశారు.

ఆటోను ఢీకొన్న లారీ



ఆటో బోల్తా పడటంతో చిందరవందరగా పడిన కూరగాయలు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో ఆదివారం ఆగి ఉన్న ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో డ్రైవర్ హరి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాలమేరకు... కొత్తపేటకు చెందిన హరి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో తాడిపత్రి వైపు కూరగాయలతో గుత్తికి వస్తూ తొండపాడు గ్రామంలో రంగనాథుడి దర్శనం కోసం ఆలయం ముందు ఆటోను ఆపారు. తాడిపత్రి వైపు నుంచి వేగంగా వచ్చిన లారీ వెనుక వైపు నుంచి ఆటోను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ హరిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆటోను ఢీ కొట్టిన అనంతరం లారీ ఆపకుండా వెళ్లిపోయి కొత్తపేట గ్రామ సమీపంలో అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులను కృష్ణా జలాలతో నింపాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్

గుంతకల్లు రూరల్: పిల్ల కాలువల ఏర్పాటు ద్వారా గుంతకల్లు మండలంలోని చెరువులన్నింటికీ కృష్ణా జలాలను అందించి మండలాన్ని సస్యశ్యామలం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని నెలగొండ గ్రామంలో రైతు సదస్సు ఏర్పాటు నిర్వహించారు. జగదీష్ మాట్లాడుతూ గుంతకల్లు మండలం మీదుగా హంద్రీనీవా వెళ్తున్నా మండలానికి మాత్రం కృష్ణా జలాలు అందడం లేదన్నారు. రాగులపాడు వద్ద ఉన్న హంద్రీనీవా కాలువ వద్ద నుంచి పిల్ల కాలువలు ఏర్పాటు చేసి గుంతకల్లులోని చెరువులన్నింటికీ నీటిని పంపిణీ చేసి రైతుల కష్టాలు తీర్చాలన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

గార్లదిన్నె: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని గ్రంథాలయ అధికారిణి శిరీష తెలిపారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్స్,కథల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పుల్లమరాజు, వెంకటేశ్వరి పాల్గొన్నారు.

యల్లనూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ ముగిసిందని లైబ్రేరియన్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. 15 రోజుల పాటు గ్రంథాలయంలో పోటీలు నిర్వహించామన్నారు. ప్రతిభ చూపిన విజేతలకు సొసైటీ అధ్యక్షుడు కిరణ్, గ్రామ పెద్ద కొండయ్య చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశామన్నారు. క్యారంబోర్డులో గురుదినేష్, ప్రణీత్ ప్రథమ, ద్వితీయ, చెస్‌లో ప్రథమ బహుమతి ప్రణీత్, మ్యూజికల్ చైర్స్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గురుదేవేంద్ర, జయలక్ష్మి, ఉమ మహేష్‌లకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో రంగప్ప, ఓబులేసు, పాఠకులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. గ్రంథాలయాధికారి జయరాములు, గ్రామపెద్దలు పెద్ద నారాయణరెడ్డి విజేతలకు బహుమతులు అందించారు.

పెద్దవడుగూరు: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఈఓ రాముడు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. నవలలు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, న్యూస్ పేపర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ బాబు, ఉసేనప్ప, రిటైర్డ్ ఉపాధ్యాయుడు నారాయణ స్వామి, గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



గుంతకల్లుటౌన్: విద్యార్థికి బహుమతి అందజేస్తున్న చైర్‌పర్సన్ భవాని



పెద్దపప్పూరు: పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న లైబ్రేరియన్ చంద్రకళ

పెద్దపప్పూరు: వేసవి శిక్షణ తరగతుల్లో బోధించిన అంశాలను గుర్తించుకోవాలని లైబ్రేరియన్ చంద్రకళ సూచించారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.

గుత్తి: స్థానిక గ్రంథాలయంలో నెల రోజులుగా సాగుతున్న సమ్మర్ క్యాంప్ ముగిసింది. కార్యక్రమంలో ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కార్యదర్శి కుళ్లాయి బాబు, గ్రంథాలయాధికారి రామాంజనేయులు, రిటైర్డ్ గ్రంథాలయాధికారి ఏసీ సుబ్బన్న, సీనియర్ ఉపాధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యం పెంపొందించుకోవాలని రిటైర్డ్ ఉపాధ్యాయుడు సత్య నారాయణ, మండల గ్రంథాలయ అధికారి విజయ భాస్కర్ తెలిపారు. గ్రంథాలయాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. అనంతరం ఈ వేసవి శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రసాద్ పాల్గొన్నారు.

పామిడి: పట్టణ గ్రంథాయంలో గ్రంథాలయశాఖ అధికారి సీ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఎంఈఓ జయానాయక్ ముఖ్య అతిథిగా హాజరై మెడల్స్, ప్రోత్సాహక బహుమతులను అందించారు.

నార్పల: స్థానిక గ్రంథాలయ శాఖలో వేసవి శిక్షణ తరగతులు ఆదివారం ముగిసినట్లు గ్రంథాలయాధికారి కె.జీవన తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తక పఠం చేయడం అలవర్చుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కండక్టర్ ప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని చక్కగా ఉపయోగించుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ విద్యార్థులకు సూచించారు. స్పోకెన్ ఇంగ్లిష్, పుస్తక పఠనం, చిత్రలేఖనం, డ్యాన్స్, వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కమ్మన్న, లెక్చరర్ వెంకటేశ్వరరావు, చిత్రకారుడు శ్రీధరన్ తదితరులు పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రం: ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం



యల్లనూరు: బహుమతులను ప్రదానం చేస్తున్న లైబ్రేరియన్ ప్రకాష్‌రెడ్డి, కిరణ్



గార్లదిన్నె: అందుకున్న పరీక్ష సామగ్రిని చూపుతున్న విద్యార్థులు

అభివృద్ధి ఓర్వలేక ఆరోపణలు

బుక్కరాయసముద్రం: అభివృద్ధిని చూసి ఓర్వలేక తమపై కుట్రలు పన్ని ఆరోపణలు చేస్తున్నారని రెడ్డిపల్లి పంచాయతీ సర్పంచ్ సాకే నరసమ్మ తెలిపారు. ఆదివారం రేకులకుంట గ్రామంలో భర్త నారాయణ స్వామితో కలిసి సర్పంచ్ విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం తాను సర్పంచు అని.. గతంలో నా భర్త సర్పంచుగా పని చేశారని తెలిపారు. అలాగే నా కుమారుడు మల్లికార్జున శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్‌గా, కోడలు ఎంపీపీగా పదవులు చేపట్టారన్నారు. ఆశావర్కర్‌తో డబ్బులు తీసుకున్నామని ఆరోపణలు చేస్తూ ఎల్లో మీడియాలో వార్తలు రాయించడం సరికాదన్నారు. గత ఎన్నికల్లో జొన్నలగడ్డ పద్మావతి గెలుపునకు శ్రమించామని, రాబోవు ఎన్నికల్లోనూ పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ నరసమ్మ, సాకే నారాయణ స్వామి

12 గేదెల అదృశ్యం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని రామా రవికుమార్ అనే రైతుకు చెందిన 12 గేదెలు పది రోజుల క్రితం కనిపించకుండా పోయాయి. ఈనెల 2వ తేదీ ఉదయం గేదెలను మేత కోసం రైతు అడవికి తీసుకెళ్లాడు. అనంతరం స్వల్ప అనారోగ్యానికి గురికావడంతో గేదెలను వదిలి ఒక్కడే ఇంటికి వచ్చాడు. రోజూలాగే ఇంటికి తిరిగి వచ్చే పశువులు సాయంత్రం అయినా రాలేదు. పది రోజులుగా చుట్టు పక్కల గ్రామాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. గేదెల విలువ సుమారు రూ.6 లక్షల వరకూ ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. ఎవరికైనా కనపడితే 9652744830 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మాజీ జెడ్పీటీసీ జంగం నల్లమ్మ మృతి

పుట్లూరు: మండలంలోని కడవకల్లుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు, మాజీ జెడ్పీటీసీ జంగం నల్లమ్మ ఆదివారం రాత్రి మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ ప్రతిపక్షంలో ఉండగా ఈమె జెడ్పీటీసీ సభ్యురాలుగా గెలుపొంది ఐదేళ్ల పాటు సేవలు అందించారు. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమె మృతి పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తమ సంతాపాన్ని తెలిపారు.



ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

పామిడి: పట్టణ మోడల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆ స్కూల్ ప్రిన్సిపాల్ అరుణ పర్యవేక్షణలో పరీక్ష పకడ్బందీగా నిర్వహించారు. ఈ పరీక్షకు చీఫ్‌గా ప్రిన్సిపాల్ అరుణ, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా పవన్‌కుమార్ వ్యవహరించారు. మొత్తం వందసీట్లకు గాను 218 మంది దరఖాస్తు చేసుకొనగా, అందులో 199 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 19 మంది గైర్హాజరయ్యారు.

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్లో ఆదివారం ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా అధికారులు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సతీష్ మాట్లాడుతూ మోడల్ స్కూల్లో ఆరో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో 185 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 156 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

పుట్లూరులో..

పుట్లూరు: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు 103 మంది హాజరైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఆస్మాసయేద తెలిపారు. ఆన్‌లైన్‌లో 110 మంది దరఖాస్తు చేసుకున్నారు.

తాడిపత్రి టౌన్: స్థానిక నందలపాడులోని ఏపీ మోడల్ స్కూలులో ఆదివారం 6వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష జరిగింది. 177 మంది పరీక్ష ఫీజు చెల్లించగా.. 159 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ నాగరాజు తెలిపారు.



పామిడి: మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు

అర్ధరాత్రి బలవంతపు వసూళ్లు!

బొమ్మనహాళ్: జల్సాలకు అలవాటు పడిన కొందరు యువకులు రాత్రిపూట వెళ్లే వాహనాలను ఆపుతూ వాహనదారులను భయభ్రాంతులకు గురిచేసి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న సంఘటన మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్ తెలిపిన వివరాల మేరకు.. ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన రాజేష్, వన్నూరుస్వామి, నాని, నాగరాజు, రవిచంద్ర శనివారం అర్ధరాత్రి సమయంలో గ్రామ శివారులోని బళ్లారి -కళ్యాణదుర్గం రహదారిపై వాహనాలను ఆపి , వాహనదారులను భయభ్రాంతులకు గురి చేసి డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. మండలంలోని శ్రీ రంగాపురం క్యాంపు గ్రామానికి చెందిన ఉప్పర హనుమంతు అనే వ్యక్తి వాహనాన్ని ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. ఆయన నుంచి రూ.1500 వసూళ్లు చేశారు. దీంతో బాధితుడు 100 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయడంతో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఉద్దేహాళ్ గ్రామ శివారులో ఉన్న యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉప్పర హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరుపరచనున్నట్లు సీఐ తెలిపారు.

విద్యాకానుక కిట్లు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ నాగరాజు

తాడిపత్రి టౌన్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని ఎంఈఓ నాగరాజు అన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఆదివారం పట్టణ, రూరల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు సోమవారం నుంచి పునః ప్రారంభం కానున్నాయన్నారు. వారం రోజుల పాటు ఉదయం 7:30 గంటల నుంచి 11:30 వరకూ తరగతులు నిర్వహించాలన్నారు. జగనన్న విద్యాకానుక కిట్లను సోమవారమే పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆర్‌ఓ ప్లాంట్లను శుభ్రం చేసి స్వచ్ఛమైన నీటిని పిల్లలకు అందించాలని సూచించారు.

పద్మశాలీయ విద్యార్థులకు పురస్కారాలు

తాడిపత్రి టౌన్: స్థానిక సీబీ రోడ్డులోని శ్రీవరదయ్య పద్మశాలీ కమ్యూనిటీ భవనంలో ఆదివారం టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. 90 శాతం మార్కులు సాధించిన 68 మంది విద్యార్థులకు అవార్డులతో పాటు నగదు ప్రోత్సాహక బహుమతులను పద్మశాలీయ సంఘం నాయకులు అందజేశారు. మొదటి బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.7,500, తృతీయ బహుమతిగా రూ.5 వేలు, కన్సొలేషన్ బహుమతిగా రూ.1,000 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు గణేష్, వరదయ్య పద్మశాలియ కమ్యూనిటీ భవన అధ్యక్షుడు వద్ది సత్యనారాయణ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న పద్మశాలీయ సంఘ నాయకులు

నాణ్యమైన విద్యనందించాలి

గుంతకల్లు రూరల్: మండల పరిధిలోని నక్కనదొడ్డి గ్రామంలో బాగే సుల్తాన్ దర్గా ఆధ్వర్యంలో ఆదివారం బాగే సుల్తాన్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టును ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. నిరుపేద విద్యార్థులకు అండగా నిలిచే క్రమంలో ఏర్పాటవుతున్న ఈ ట్రస్టు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బాగ్ ఈ సుల్తాన్ సాహేబ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు, మైనార్టీ నాయకుడు నూర్ నిజామి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

యాడికి: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో ఆదివారం ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. అనంతపురం సహారీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి చెందిన 10 మంది వైద్యుల బృందం 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, గైనిక్, ఈసీజీ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి ఆర్యవైశ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యులు భాను కిరణ్, మాధవీలత, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధికారులు తప్పక హాజరుకావాలని తహసీల్దారు సుమతి ఓ ప్రకటనలో తెలిపారు.

రైతుకు తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో విత్తనం వేస్తుండగా ఆదివారం విద్యుదాఘాతానికి గురై రైతు ఆదినారాయణరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యుల వివరాలమేరకు.. గ్రామానికి చెందిన రైతు ఆదినారాయణరెడ్డి తనకున్న మూడుకరాల పొలంలో ట్రాక్టర్ ద్వారా వేరుశనగ విత్తనం వేస్తున్నారు. అయితే విత్తనం వేసే క్రమంలో ట్రాక్టర్ నుంచి వెనుక వైపునకు చూస్తుండగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తూ రైతుకు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సల కోసం అనంతపురానికి తీసుకెళ్లార. తమ పొలాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని రైతు ఆదినారాయణరెడ్డి వాపోయారు.

బాధితులకు పరామర్శ



రైతు ఆదినారాయణరెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుత్తి/గుత్తి రూరల్: మండలంలోని కె.ఊబిచెర్ల గ్రామంలో ఆదివారం విద్యుత్ తీగలు తగలడంతో భరత్ (3) మృతి చెందాడు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుభాష్‌రెడ్డి, సీనియర్ నాయకులు రామరంగారెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి మృతుడి తల్లిదండ్రులు రామచంద్ర, హరితలను పరామర్శించారు. అలాగే పెద్దొడ్డి గ్రామంలో విద్యుత్ వైర్లు తగిలి తీవ్రంగా గాయపడిన రైతు ఆదినారాయణరెడ్డి, వన్నేదొడ్డిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాసులు కుటుంబ సభ్యులు, బంధువులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పుట్లూరు: నాగిరెడ్డిపల్లి సమీపంలో పుట్లూరు - తాడిపత్రి ప్రధాన రోడ్డుపై ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. తాడిపత్రికి వెళ్తున్న ఆటో.. ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో కేశవరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పుల్లమ్మకు గాయాలు కాగా, వారిని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. వీరిలో కేశవరెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

కారు బోల్తా: నలుగురికి తీవ్ర గాయాలు

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట అటవీ ప్రాంతంలోని ఓ మలుపు వద్ద ఆదివారం తెల్లవారుజామున కారు బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. అనంతపురం పట్టణం ఆజాద్ నగర్‌కు చెందిన రిజాయ్, మెహరాజ్, రాఖేష్, ఇంతూ, ఖలందర్‌లు యాడికి మండల కేంద్రంలో జరుగుతున్న ఓ వివాహ వేడుకకు కారులో బయలుదేరారు. ముచ్చుకోట అటవీ ప్రాంతంలోని ఓ మలుపు వద్దకు వెళ్లగానే.. కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. రియాజ్ ఆరోగ్య పరిస్థితి విషమింగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోండి

గుంతకల్లుటౌన్: పట్టణంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సీ.రమేష్ అధికారులను కోరారు. ఎండల తీవ్రత ఉన్న కారణంగా రాష్ట్ర ప్రభుత్వం జూన్ 12 నుంచి 17 వరకు ఒంటిపూట బడి నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసినా పలు పాఠశాలలు మాత్రం సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తామని తల్లిదండ్రులకు సందేశాలు పంపుతున్నారన్నారు. అలాగే ఫీజుల కోసం వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



వర్షపు నీటిని పరిశీలిస్తున్న కమిషనర్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మోదినాబాద్‌లో పారిశుధ్య పనులను ఆదివారం మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున పరిశీలించారు. శనివారం కురిసిన భారీ వర్షం కారణంగా కాలనీలో ఇళ్ల ముంగిట నిల్వ ఉన్న బురద, వర్షపునీటిని శుభ్రం చేయించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను తీసివేయించాలన్నారు. చెత్తా చెదారాన్ని డ్రైనేజీల్లో పారబోయకుండా ఇంటింటా చెత్తసేకరణకు వచ్చే ఆటోలకు అందజేయాలని కమిషనర్ ప్రజలకు సూచించారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

గుత్తి: పట్టణ శివారులోని గుత్తి-అనంతపురం రోడ్డులో ఆదివారం సుబ్బన్న అనే వ్యక్తి ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనం నుంచి జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. తుగ్గలి మండలం రాతనకు చెందిన సుబ్బన్న పని మీద బైక్‌లో తన స్నేహితునితో కలిసి పెద్దవడుగూరుకు బయలు దేరారు. అయితే మార్గం మధ్యలోని గుత్తి-అనంతపురం రోడ్డులో స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపు తప్పింది. సుబ్బన్న తీవ్రంగా గాయపడగా.. స్థానికులు అతన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జూదరుల అరెస్ట్

పెద్దపప్పూరు: చీమలవాగుపల్లి సమీపంలో రెండు చోట్ల గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై ఆదివారం రాత్రి ఎస్ఐ ఖాజాహుస్సేన్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. 13 మంది జూదరులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.57 వేల నగదు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

యువకుడి ఆత్మహత్య



చిన్న ఆచారి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

గుత్తి రూరల్: మండలంలోని ఊటకల్లు గ్రామంలో వడ్ల చిన్న ఆచారి (35) అనే యువకుడు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలమేరకు.. ఊటకల్లుకు చెందిన వడ్ల చిన్నఆచారి అనే యువకుడు కొన్ని రోజులుగా కుటుంబ సమస్యలతో పాటుగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే చిన్న ఆచారి గ్రామ శివారులోని కొండ ప్రాంతానికి చేరుకొని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆదివారం సాయంత్రం అటుగా వెళ్లిన గ్రామస్తులు ఆచారి మృతదేహాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గార్లదిన్నె: మండలంలోని కోటంకకు చెందిన కేశవరెడ్డి (52) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్ఐ సాగర్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కేశవరెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నాడు. ఈనెల 7న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అపస్మారక స్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.